

ఆర్టీసీ చైర్మన్‌గా రెండేండ్ల పదవీకాలం పూర్తిచేసుకొన్న బాజిరెడ్డి గోవర్ధన్‌తో పాటు ఆయన సతీమణి వినోదను పూలమాలలతో సన్మానిస్తున్న ఎండీ సజ్జనార్, అధికారులు

# బాజిరెడ్డికి ఆత్మీయ వీడ్కోలు

- ఆర్టీసీ చైర్మన్‌గా రెండేండ్ల పదవీకాలం పూర్తి
- ఘనంగా సన్మానం

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): టీఎస్‌ఆర్టీసీ చైర్మన్‌గా రెండేండ్ల పదవీకాలం పూర్తిచేసుకున్న బాజిరెడ్డి గోవర్ధన్‌కి సంస్థ ఉన్నతాధికారులు ఆత్మీయవీడ్కోలు పలికారు. హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో బాజిరెడ్డి గోవర్ధన్-వినోద దంపతులను ఘనంగా సన్మానించారు. చైర్మన్‌గా సంస్థకు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. తన 40 ఏండ్ల రాజకీయ జీవితంలో ఆర్టీసీ చైర్మన్‌గా పనిచేసిన కాలాన్ని మరిచిపోలేనని చెప్పారు. తన పదవీకాలంలోనే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం ఎంతో సంతోషంగా ఉన్నదని తెలిపారు. విధి నిర్వహణలో తోడ్పాటు అందించిన సంస్థ ఎండీ సజ్జనార్‌తోపాటు అధికారులు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. సజ్జనార్ మాట్లాడుతూ.. గత రెండేండ్లలో దాదాపు రూ.1,600 కోట్ల నష్టాన్ని తగ్గించామని చెప్పారు. సంస్థ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించడంలో బాజిరెడ్డి కీలకపాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీవోవో డాక్టర్ వీ రవీందర్, జేడీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్, ఈడీలు మునిశేఖర్, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, వినోద్‌కుమార్, కృష్ణకాంత్, నిజామాబాద్ ఏడీఏ చైర్మన్ సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగారాం, బాజిరెడ్డి కుటుంబసభ్యులతోపాటు సంస్థ హెచ్‌వోడీలు, ఆర్ఎంలు, పాల్గొన్నారు.



నవీన్ మిట్టల్‌కు వినతిపత్రం అందజేస్తున్న బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు

# అన్ని జిల్లాల్లో బ్రాహ్మణ సంక్షేమ భవనాలు

- బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో నవీన్ మిట్టల్

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 33 జిల్లాల్లో బ్రాహ్మణ సంక్షేమ భవనాలకు స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకుంటానని భూపరిపాలన శాఖ కమిషనర్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ తెలంగాణ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులకు హామీ ఇచ్చారు. బ్రాహ్మణ సంఘాల నాయకులు మంగళవారం ఆయనను కలిసి సంక్షేమ భవనాల కోసం స్థలాలు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. సీఎం కేసీఆర్ ఆకాంక్ష మేరకు దీనిపై గతంలోనే అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రతిపాదనలు వెళ్లాయని చెప్పారు. త్వరలో మరోసారి కలెక్టర్లకు లేఖలు రాసి కేటాయింపు జరిగేలా చర్యలు తీసుకుంటానని, అన్ని సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో శృంగేరి వేద పండితులు వ్యాసోజుల రాధాకృష్ణశర్మ, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యులు మరుమాముల వెంకటరమణశర్మ, బోర్పట్ల హనుమంత ఆచార్యులు, అష్టకాల రామ్మోహన్, జోషి గోపాలశర్మ, విద్యావేత్త ఈశ్వరగారి రమణ, సంగారెడ్డి జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రామారావు దేశ్‌పాండే, వేద పండితులు మంచినీళ్ల రామశర్మ, కాసుల రాధాకృష్ణశర్మ, రమేశ్‌రావు కులకర్ణి, బక్షి కిషన్‌రావు, మారేపల్లి చైతన్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణానదిలో.. డాల్ఫిన్ నోస్ గుట్ట!

కృష్ణానదిలో సహజసిద్ధంగా డాల్ఫిన్ నోస్ ఆకారంలో ఉన్న గుట్టను 'నమస్తే తెలంగాణ' గుర్తించింది. కాస్త సాహసోపేతమైనప్పటికీ.. కొల్లాపూర్ రూరల్, పెంట్లవెల్లి 'నమస్తే తెలంగాణ' రిపోర్టర్లు.. కృష్ణానదిలో 7 కిలోమీటర్లు బోటులో ప్రయాణించి ఈ డాల్ఫిన్ నోస్ ఆకారంలో ఉన్న గుట్ట చిత్రాన్ని తీశారు. మీరు చూస్తున్న చిత్రం అదే. కొల్లాపూర్‌కు సుమారు 10 కిలోమీటర్లు దూరంలోని అమరగిరి నుంచి బోటులో సుమారు 7 కిలోమీటర్లు దూరం కృష్ణానదిలోనే ప్రయాణిస్తే.. చీమల తిప్ప వస్తుంది. అక్కడి నుంచి అంకాలమ్మదేవి ఆలయం ఉన్న గుట్టను చూస్తే.. అచ్చంగా.. డాల్ఫిన్ నోస్‌లాగా కనపడుతుండటం మనల్ని ఆశ్చర్యచకితులను చేస్తున్నది.

ఫొటో : సీపీ నాయుడు, హకింకారి రమణాజిరావు: కొల్లాపూర్ రూరల్/పెంట్లవెల్లి



# అమృతమయ సమాజాన్ని నిర్మిద్దాం

- శాంతి, సంతోషాలతో కూడిన సమాజం కోసం పాటుపడదాం
- మాతా అమృతానందమయిదేవి
- వైభవంగా సప్తతి మహోత్సవం
- 193 దేశాల ప్రతినిధుల హాజరు



తన జన్మదినం సందర్భంగా కేరళలో నిర్వహించిన కార్యక్రమంలో అమృతకీర్తి పురస్కారం అందజేస్తున్న అమృతానందమయిదేవి

కేరళ అమృతపురి నుంచి నమస్తే తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి: సర్వమానవాళి సుఖసంతోషాలతో ఉండే అమృతానందలోకాన్ని నిర్మిద్దాం అని మాతా అమృతానందమయిదేవి పిలుపునిచ్చారు. శాంతి, సంతోష సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. మాతా అమృతానంద 70వ జన్మదినాన్ని పురస్కరించుకొని కేరళలోని అమృతపురి (వల్లికాపురి) శోభాయమనమైంది. ప్రపంచ నలుమూలల నుంచి వందల మంది అమృతానందమయిదేవి భక్తులు, దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల నుంచి వేల మంది మంగళవారం అమృతపురికి చేరుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు వేడుకలు వైభవంగా సాగాయి. అమ్మ సందేశం, ప్రార్థనతో సప్తవర్ణ సంరంభం ప్రారంభమైంది. వేల మంది భక్తుల కోసం అమ్మ తన జన్మదిన సందేశాన్ని ఇచ్చారు. శాంతి, సంతోషం, ప్రేమ, కరుణను పంచేందుకు ప్రపంచ మానవాళి పాటుపడాలని పిలుపునిచ్చారు. మానవజన్మ ఎత్తినందుకు గర్వపడాలని, బాధలమయ ప్రపంచం నుంచి మనుషులు బంధాలమయి ప్రపంచం కోసం ఎవరికి వారి యథాశక్తి ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. కాలువల్లో పారే మురుగునీరు భూమిని కల్లోలానికి గురి చేస్తున్నట్టే మనిషి చెడు ఆలోచనలు, విపరీత చేష్టల వల్ల తన శరీరాన్ని మలినం చేసుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. మనకెంత సంపద ఉన్నా, మన చుట్టూ గంపెడు బలగం ఉన్నా ఆపద సంభవించినప్పుడు మనతో ఏ సంపద, ఏ బలగం రాదని.. కొవిడ్ కాలం అదే చెప్పిందనే విషయం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు.

### ప్రధాని సహా పలువురి సందేశాలు

అమ్మ జన్మదినం సందర్భంగా ప్రధాని మోదీ, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్రమంత్రులు రాజనాథ్ సింగ్, నితిన్ గడ్కరీ సహా జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు వీడియో సందేశాలు పంపారు. అమెరికా, యూఎన్ సభ్యదేశాల ప్రతినిధులు, జాతీయ, అంతర్జాతీయ సినిమా ప్రముఖులు అమ్మకు వీడియో సందేశాలు పంపేందుకు పోటీపడ్డారు. 193 దేశాల నుంచి, దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు ఆయా ప్రాంతాల నుంచి మట్టిని తెచ్చి అమ్మకు సమర్పించారు. ప్రపంచం అంతా ఒక్కటే అనే సందేశాన్ని అమ్మ తన 70వ సప్తతిని పురష్కరించుకొని ప్రతినిధులు తెచ్చిన మట్టిని ఒక్క ముద్దగా చేసి.. ఆ మట్టి ముద్దను ప్రార్థించారు. అనంతరం ఆ మట్టిలో మొక్కను నాటి దానికి విశ్వ ప్రేమ వృక్ష అని నామకారణం చేశారు. మాతా అమృతానందమయిదేవికి 2023 సంవత్సరానికి వరల్డ్ లీడర్ ఫర్ పీస్ అండ్ సెక్యూరిటీ అవార్డును బోస్టన్ గ్లోబల్ ఫోరమ్ అందజేసింది. అమ్మ జన్మదినోత్సవం సందర్భంగా అమృతపురి ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొన్నది. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన ప్రతినిధులు వారి వారి జాతీయ జెండాలను చేబూని తమ శుభాకాంక్షలను అమ్మకు తెలియజేశారు. దేశంలోని రాష్ట్రాల ప్రతినిధులు ఆయా ప్రాంతాల సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే ఆహార్యంతో విచ్చేశారు. కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి, లక్షద్వీప్ సహా పలు ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాలకు చెందిన జంటలకు అమ్మ జన్మదినం సందర్భంగా సామూహిక వివాహాలు నిర్వహించారు.

# కసరత్తుతోనే హృద్రోగాలకు చెక్

- వారానికి మూడు గంటలు శ్రమిస్తే మీ గుండె పదిలం
- డెస్క్ బేస్డ్ విధులతో ముప్పు
- ఎన్ఐఎన్ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): మీరు కుర్చీకి అతుక్కుపోయి పనిచేస్తారా? శారీరక శ్రమ అస్సలు చేయారా? అయితే మీకు హృద్రోగ ముప్పు పొంచి ఉన్నట్టే! దీర్ఘకాలిక వ్యాధులు దరిచేసే సమయం ఆసన్నమైనట్టే! వారానికి కనీసం 3 గంటలైనా ఫిజికల్ యాక్టివిటీ లేనివారికి దీర్ఘకాలిక వ్యాధుల ముప్పు ఉంటుందని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) నిర్వహించిన తాజా అధ్యయనంలో తేలింది. గంటల తరబడి కుర్చీలకు పరిమితమయ్యే ఉద్యోగాలు చేసేవారు ఎక్కువ శాతం ఒత్తిడికి గురికావడంతో గుండెపోటు, డయాబెటిస్, హైబీపీ, బీపీతోపాటు గుండె వ్యాధులు పెరుగుతున్నాయని తేల్చారు.

### 22 శాతం మంది మాత్రమే వ్యాయామం

ఐటీ, ఐటీయేతర ఉద్యోగుల జీవన శైలిని పరిశీలించిన ఎన్ఐఎన్ సైంటిస్టులు.. 22 శాతం మంది మాత్రమే శారీరక వ్యాయామాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు గుర్తించారు. మెజార్టీ జనాల్లో జీవక్రియలు సమస్యాత్మకంగా ఉన్నాయని, మెటబాలిక్ సిండ్రోమ్, హెడీఎల్, అధిక బరువు, బానపొట్ట వంటి సమస్యల బారిన పడుతున్నారని తేల్చారు. ఆడవారి కంటే మగవారిలో అధిక బరువు సమస్యలు ఉండగా.. మహిళల్లో పరిమితికి మించి ట్రైగ్లిజరైడ్స్ 150 మైక్రోగ్రాములు ఉన్నదని వెల్లడించారు.

### కూర్చుంటే ప్రమాదమే..

ఎక్కువ గంటలపాటు కదలకుండా కూర్చొండి పోయేవారిలో జీవక్రియలు మందగిస్తున్నాయని, ప్రధానంగా జీర్ణసంబంధిత వ్యాధుల బారినపడుతున్నారని పరిశోధకులు గుర్తించారు. కనీసం 8 గంటలపాటు పనిచేసేవారు ఉదయం లేదా సాయంత్రం వేళల్లో శారీరక వ్యాయామాలు లేదా కదలికలు చేయడం వలన గుండె రక్త ప్రసరణ మెరుగు పడటమే కాకుండా రక్తనాళాల్లో కొవ్వులు పేరుకుపోయే ప్రమాదం కొంత మేర తగ్గుతుందని సూచించారు.

# విజయ్‌కుమార్‌కు యూకే సాహిత్య ఫెస్టివల్ ఆహ్వానం



విజయ్‌కుమార్

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్ తడకమల్లకు యూకే సాహిత్య ఫెస్టివల్ నుంచి ఆహ్వానం అందింది. ఈ నెల 6 నుంచి 10 వరకు యూకేలో జరిగే 74 ఏండ్ల చరిత్ర కలిగిన చెల్టెన్‌హామ్ లిటరేచర్ ఫెస్టివల్‌కు హాజరుకావాలని నిర్వాహకులు ఆహ్వానం పంపారు. ప్రపంచంలోనే తొలి లిటరేచర్ ఫెస్టివల్‌గా పేరుగాంచిన ఈ కార్యక్రమానికి ప్రతిఏటా ప్రపంచవ్యాప్తంగా ఐదుగురు సాహితీవేత్తలను ఆహ్వానించడం సంప్రదాయం. ఉస్మానియా యూనివర్సిటీ ఆంగ్ల విభాగంలో పనిచేసిన ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌కు ఆహ్వానం అందడంపై పలువురు అభినందనలు తెలిపారు. అర్జెంటీనా, బోట్సువానా, నైజీరియా, టర్కీ నుంచి కూడా సాహితీవేత్తలు కార్యక్రమంలో పాల్గొననున్నారు.

